సాక్షి విజయనగరం

గురువారం । 8 । ఆగస్టు । 2024

న్యూస్‌రీల్

జగన్‌ను కలిసిన జిల్లా నేతలు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇప్పిలి అనంతం

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ డిప్యూటీ కో ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఇప్పిలి అనంతం బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

'భోజన' నిర్లక్ష్యంపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో జరుగుతున్న నిర్లక్ష్యంపై జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మండిపడ్డారు. 'ప్రభుత్వ బడిలో క్యారేజీ భోజనం' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన ఫొటోవార్తపై ఆయన స్పందించారు. భోజన పథకం నిర్వహణ తీరుపై వివరణ ఇవ్వాలని పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌ను ఆదేశించారు. పాఠశాలలో పది నుంచి పదిహేను మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుని భోజనం చేస్తున్నట్టు హెచ్‌ఎం వివరణ ఇచ్చినట్టు డీఈఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి నుంచి క్యారేజీలు తీసుకురాకుండా ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేలా అవగాహన కల్పిస్తున్నామని హెచ్‌ఎం తెలియజేశారన్నారు.

జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎం.భువన



సూర్యకళ

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగబోయే బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణిలు అర్హత సాధించారు. ఈనెల 2 నుంచి 4 వరకు నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం బుద్ధగయలో జరగబోయే జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్న వారిలో ఎం.భువన ఆంధ్రాజట్టు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, వి.సూర్యకళ జట్టులో ఆడనుంది. ఇద్దరు క్రీడాకారిణులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపిన లక్ష్మణరావు, ట్రెజరర్ ఈశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సేవలు భేష్

- సీహెచ్ అగ్రహారం వెల్‌నెస్ కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు



వెల్‌నెస్ కేంద్రం సిబ్బందిని అభినందిస్తున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీహెచ్ అగ్రహారం వెల్‌నెస్ కేంద్రంలో అందిస్తున్న మెరుగైన వైద్య సేవలకు జాతీయస్థాయి గుర్తింపు లభించినట్టు వైద్యాధికారి రాజేష్‌వర్మ బుధవారం తెలిపారు. గత నెల 11న ఇద్దరు కేంద్రబృంద సభ్యులు వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారన్నారు. ఓపీ, ల్యాబ్, ఫార్మసీ, టెలికన్సల్టెన్సీ, వ్యాధి నిరోధక టీకాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల ప్రాతిపదికన గుర్తింపు ఇచ్చారన్నారు. ఈ మేరకు వైద్యసిబ్బందిని వైద్యాధికారి అభినందించారు.

ఇసుకాసురులు..!

- గ్రోత్ సెంటర్ నుంచి ఇసుక అక్రమంగా తరలింపు
- ఆర్డీఓ ఆదేశించినా అమర్చని సీసీ కెమెరాలు
- అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం
- చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు
- చెరువు గట్లనూ వదలని వైనం
- ఆవేదనలో ఆయకట్టు రైతులు





సీసీ కెమెరాలు లేకుండా బొబ్బిలి స్టాక్‌యార్డులో ఇసుక లోడింగ్

బొబ్బిలి: అధికార బలంతో రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ స్టాక్ యార్డు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. కొండలు, గుట్టలు, చెరువులను గుల్లచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రివేళ కాసుల పంట పండిస్తున్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపునకు బొబ్బిలి కేరాఫ్‌గా మారింది. అధికారం ఉంది.. అడ్డు చెప్పేవాడు ఎవడు?.. అడ్డంగా దోచేద్దాం.. అన్న దోరణి కింది స్థాయి నుంచి పైస్థాయి నాయకుల వరకు స్పష్టంగా కనిపిస్తోంది. బొబ్బిలి పట్టణ సరిహద్దులో ఉన్న చెరువులను చతుర్ముఖ వ్యూహంలా తవ్వేస్తున్నారు. ఓ చెరువులో తవ్వకాలను అధికారులు పసిగడితే.. మరో చెరువుకు యంత్రాలను తరలించి తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికే కింతలివానిపేట, దిబ్బగుడ్డివలస, రంగరాయపురం చెరువుగర్భాలు, గట్లులను తవ్వేశారు. ప్రస్తుతం వర్షాలు కురవడం, చెరువుల్లో నీరు చేరడంతో గ్రోత్ సెంటర్ సమీపాన ఉన్న చెరువులకు మకాంమార్చారు.



గ్రోత్‌సెంటర్ సమీపంలో తెల్లచెరువు గట్టును తవ్వేసిన అక్రమార్కులు

సీసీ కెమెరాలేవీ?

గత ప్రభుత్వ హయాంలో సీసీ కెమెరాల నిఘా, ఆన్‌లైన్ బిల్లింగ్ విధానంతో ఇసుక విక్రయాలు జరిగేవి. ఇప్పుడా నిబంధనలకు కూటమి ప్రభుత్వం నీళ్లొదిలింది. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని ఇసుక విక్రయాలు నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆన్‌లైన్ బిల్లులు లేకుండా నేరుగా రశీదులు ఇస్తున్నారు. ఒకే రసీదుపై అక్రమంగా రెండుమూడు లోడ్లు తరలిస్తున్నట్టు సమాచారం. మరోవైపు సీసీ కెమెరాలు లేకపోవడంతో నాయకులు సొంతంగా వాహనాలు ఏర్పాటుచేసి ఇసుకను తరలించేస్తున్నారు. ప్రశ్నించే సిబ్బందిపై జులంప్రదర్శిస్తున్నట్టు తెలిసింది.

గ్రావెల్ దందాలో వారే కీలకం..

బొబ్బిలి పట్టణంలోని మల్లంపేట, మండలంలోని దిబ్బగుడివలస గ్రామాలకు చెందిన నాయకులు గ్రావెల్ తరలింపులో చక్రం తిప్పుతున్నారు. వీరు అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. మల్లంపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడు దిబ్బగుడ్డివలస గ్రామ సమీపాన ఉన్న నారచెరువులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టాడు. 10 ట్రాక్టర్లు, ఒక జేసీబీతో రాత్రి 10 గంటలకు తవ్వకాలు ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్డీఓ రంగంలోకి దిగి పోలీసుల సహకారంతో తవ్వకాలను అడ్డుకున్నారు. 5 ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అయితే, అప్పటి తహసీల్దార్ కేవలం రూ.3వేలు ఫైన్‌వేసి వాహనాలు తిరిగి అప్పగించేశారు. దీంతో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదంటూ కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



ఇసుక కోసం బారులు తీరిన లారీలు

సుమారు 8 వేల టన్నుల విక్రయం

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని స్టాక్ యార్డు నుంచి గత నెల 9న ఇసుక విక్రయాలు ప్రారంభించారు. ఉచిత ఇసుక అంటూనే రవాణా చార్జీల కింద టన్నుకు రూ.605లు వసూలు చేస్తు న్నారు. వారం రోజుల కిందటి వరకూ ఇక్కడ ఇసుక విక్రయాలు నెమ్మదిగా సాగాయి. ఇది జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడం, రవాణా ఖర్చులు అధికమవుతాయన్న భావనతో చాలామంది ఆసక్తి చూపేవారు కాదు. డెంకాడ, కొత్తవలస స్టాక్ పాయింట్‌లలో ఇసుక నిల్వలు పూర్తిగా అయిపోవడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు విశాఖలోని పలు మండలాల వారు బొబ్బిలియార్డు నుంచే ఇసుక కొనుగోలు చేస్తున్నారు. కొద్దిరోజుల్లోనే ఇక్కడ నుంచి సుమారు 8వేల టన్నుల ఇసుక సరఫరా అయింది. ఇసుకకు డిమాండ్ ఉండడంతో అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగారు. సీసీకెమెరాలు లేకపోవడంతో అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొందరు వేగావతి నది నుంచి పారాది, పెంట, అలజంగి, కారాడ తదితర గ్రామాల వద్ద ఇసుకను తవ్వుతున్నారు. ఎడ్లబళ్లపై సమీప ప్రాంతాలకు తరలించి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారు. అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకూ ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

ఆర్డీఓ ఆదేశించారు

> గ్రోత్ సెంటర్‌లోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. బకెట్‌తో ఇసుక సరిగా తూకం వచ్చేలా చేయాలని స్టాక్‌యార్డు సిబ్బందిని ఆదేశించాం. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – ఎం.శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలి

- అట్రాసిటీ కేసులపై అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ వకుల్‌జిందాల్
- బాధితులకు పరిహారం అందేలా చూడాలి



సమీక్ష సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైమ్: అట్రాసిటీ కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తిచేసి అభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేయాలని డీఎస్పీలను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను సమీక్షించారు. కేసుల దర్యాప్తుపై సూచనలిచ్చారు. అట్రాసిటీ కేసులను దర్యాప్తు చేసే అధికారులు విధిగా సంఘటనా స్థలాలను సందర్శించాలని, ప్రత్యక్ష సాక్షులను విచారణ చేయాలని ఆదేశించారు. నిందితులపై నేరారోపణలు న్యాయస్థానంలో నిరూపణ చేసేందుకు అవసరమైన ప్రధాన సాక్షులను విచారణ చేయాలని, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, ధ్రువపత్రాలను సంబంధిత అధికారుల వద్ద నుంచి, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి త్వరితగతిన పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. అభియోగపత్రాల తయారుచేయడంలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ ఎస్‌ఐలు గణేష్, మురళి, జూనియర్ సహాయకులు ఆర్.వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మండల, డివిజన్ స్థాయిలో వినతుల స్వీకరణ

- తహసీల్దార్ కార్యాలయాలకు వాచ్‌మెన్, సీసీ కెమెరాల ఏర్పాటు
- రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక (గ్రీవెన్స్‌సెల్) నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. వచ్చిన వినతులను వెంటవెంటనే పరిశీలించి నిర్ణీత గడువులోపల వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించలేని వాటికి కారణాలను సవివరంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితర రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలోని రెవెన్యూశాఖలో ఉద్యోగుల ఖాళీలు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, అస్సైన్‌మెంట్ భూములు, 22-ఏ, హౌస్ సైట్స్, వెబ్‌ల్యాండ్ మ్యుటేషన్స్, ల్యాండ్ కన్వర్షన్, కౌలు గుర్తింపుకార్డులు, కులధ్రువీకరణ పత్రాలు, రేషన్ డిపోలు, కులవివాదాలు, రెవెన్యూ రికవరీ యాక్ట్, నీటి పన్నువసూలు, వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులు, రెవెన్యూ భవనాల స్థితిగతులు, ఇసుక విక్రయాలు, ఈనాం భూముల వివాదాలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఆయా విషయాలకు సంబంధించిన అంశాలను డీఆర్వో ఎస్.డి.అనిత పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌సెల్‌కు వస్తున్న వినతుల్లో రెవెన్యూకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. తహసీల్దార్లు, ఆర్డీఓలు క్రియాశీలంగా వ్యవహరించి తమ స్థాయిలోనే వీలైనంత త్వరగా వాటికి పరిష్కారం చూపాలన్నారు. గృహ నిర్మాణం కోసం ఇప్పటి వరకు సేకరించిన భూముల వివరాలు, రూపొందించిన లే అవుట్లు, పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు, ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను 15 రోజుల్లోగా ఆర్డీఓల ద్వారా తమకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ల్యాండ్ కన్వెర్షన్‌కు సంబంధించి 820 కేసుల్లో సుమారు రూ.5.29 కోట్లు బకాయి ఉందని, వారికి వెంటనే నోటీసులు ఇవ్వాలని, స్పందించకపోతే ఆర్‌ఆర్ యాక్ట్‌ను ప్రయోగించాలని సూచించారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలకు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్‌లను నియమించాలని ఆదేశించారు. రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి త్వరలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానున్నాయని, వాటి ప్రకారం చర్యలు తసుకోవాలని సూచించారు. నీటిపన్ను వసూలుకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. లోక్ అదాలత్ పెండింగ్ కేసుల వివరాలను పదిరోజుల్లోగా తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ సుమబాల, డీఎస్‌ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయీస్ డీఎం మీనాకుమారి, ఆర్డీఓలు ఎం.వి.సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సమాజంపై స్పృహ అవసరం

- సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



విజయనగరం అర్బన్:

ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజంపై స్పృహ కలిగి జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని సినీగేయ రచయిత, కవి, గాయకుడు సుద్దాల అశోక్ పిలుపునిచ్చారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో జాతీయ నూతన విద్యావిధానం ద్వారా 'మంచి ఆలోచనలు-సృజనాత్మకత, మూర్తిమత్వ వికాసం' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. తొలుత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణితో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం సదస్సులో ఆయన మట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఉన్న సమాజమే ఉన్నతమైనదని, ఆ దిశగా సమాజ నిర్మాణానికి విద్యార్థి దశనుంచి ప్రతి ఒక్కరూ బాధ్యత కృషిచేయాలన్నారు. కష్టం వెనుక సుఖం, బాధ తరువాత ఆనందం, సహనంతోనే విజయం చేకూరుతాయని ఉద్బోధించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా అత్యుత్తమ స్థాయికి ఎదిగినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని, అదే ఫిలాసఫీని పాటల ద్వారా తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం తన బాణీ పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. వీసీ కట్టిమణి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో చదువుతో పాటు ఆటలు, పాటలు, లలిత కళలు, చిత్రలేఖనం, సాహిత్యం, జాతీయత, సంస్కృతి, సంప్రదాయాలను పొందుపరిచారన్నారు. అనంతరం అశోక్‌ను వీసీ దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. వర్సిటీ పరిపాలన అధికారి డాక్టర్ వి.ఎస్.సూర్యనారాయణ అనుసంధాన కర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్రబాబు, జె.ఎం.మిశ్రా, పరికిపండ్ల శ్రీదేవి, అనిరుద్‌కుమార్, సురేష్‌బాబు, దివ్య, ప్రమా, లతా, వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అశోక్‌తేజను సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

క్లుప్తంగా

రోగం వస్తే డోలీయే శరణ్యం



రోగిని డోలీపై తీసుకు వెళ్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని దేవరశిర్లం పంచాయతీ మెట్టలోవర కండి గ్రామానికి చెందిన గిరిజనులకు రోగమొస్తే డోలీయే వారికి శరణ్యం. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, ఏ కష్టసుఖాలకైనా పొలం గట్లపై నుంచి నడక సాగించక తప్పని దుస్థితి గ్రామస్తులకు దాపురించింది. గ్రామానికి చెందిన మెల్లిక దిగుడమ్మ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. వైద్యసిబ్బంది చికిత్స అందించినప్పటికీ, తగ్గుముఖ పట్టకపోవడంతో బుధవారం కుటుంబసభ్యులు దిగుడమ్మను డోలీలో మక్కువలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



చెరువుగట్టుపై బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

రాజాం సిటీ: రాజాం మున్సిపాల్టీ పరిధి కొండంపేట–బుచ్చెంపేట గ్రామాల మధ్య ఉన్న ఈరా చెరువు గట్టుపై బుధవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పడంతో ట్రక్కు బోల్తాపడింది. కళాశాల, పాఠశాలలు, ఆస్పత్రికి వెళ్లే రహదారి కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో ఈ రహదారినే వినియోగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే అడ్డూ అదుపులేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఇసుకను తరలిస్తుండగా అదుపుతప్పి ట్రక్కు చెరువు వైపు బోల్తాపడింది. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ రహదారి గుండా ఎవరూ వెళ్లకపోవడంతో పెనుప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇసుక రవాణా ప్రతిరోజూ వేకువ జాము నుంచి చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇసుక టాక్టర్లు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది ప్రాంతం బూర్జ రేవు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక లోడ్‌చేసి తరలిస్తుండగా బుధవారం ఉదయం పోలీసులు మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి మండల మేజిస్ట్రేట్ తహసీల్దార్ జె.రాములమ్మ ఎదుట హాజరు పర్చినట్లు తెలియజేశారు. తహసీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో టాక్టరుకు రూ.10 వేలు వంతున అపరాధ రుసుం విధించామని, ఆ రుసుంను బ్యాంక్‌లో చలానా తీసి రసీదు సమర్పించిన అనంతరం ట్రాక్టర్లను విడుదల చేయనున్నామన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



బొబ్బిలి: పట్టణంలోని లోకబంధు రెసిడెన్సీ వద్ద రోడ్డుపై ఉంచిన ద్విచక్రవాహనం అకస్మాత్తుగా దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం ఓ వాహన దారుడు బైక్‌ను రోడ్డు అంచునే నిలిపి ఉంచాడు. అయితే ఒక్కసారిగా బైక్ నుంచి మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే అక్కడే స్టైల్ బజార్ షాపులో ఉన్న అగ్నిమాపక పరికరంతో షాపు వర్కర్లు మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

88 కిలోల గంజాయి పట్టివేత

సాలూరు రూరల్: ఒడిశా నుంచి తరలిస్తున్న గంజాయిని సాలూరు మండలంలోని బాగువలస గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఒడిశా నుంచి పాచిపెంట మండలంలోని మాతుమూరు గ్రామం మీదుగా సుమారు 88 కేజీల గంజాయిని బొలెరో వాహనంలో ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బాగువలస గ్రామం చేరుకోగానే వెంబడించి వాహనాన్ని పట్టుకున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై వెంకటరమణను వివరణ అడగ్గా గురువారం వివరాలు తెలియపరుస్తామన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

బెండ సాగుతో.. ఆదాయం మెండు

- పంటకు అన్ని సీజన్లు అనుకూలం
- కూరలో అధిక పోషకాలు



బెండకాయలు కోస్తున్న రైతులు



విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్తున్న రైతులు

రామభద్రపురం:

రబీ, ఖరీఫ్ సీజన్లలో వేసిన బెండ సాగు రైతులకు సిరులు పంట పండిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని రామభద్రపురం, బాడంగి, దత్తిరాజేరు, మెంటాడ, సాలూరు, బొబ్బిలి మండలాల రైతులు వందలాది ఎకరాల్లో బెండ పంట సాగు చేస్తున్నారు. సాగునీటి వనరు ఉన్న బోరు బావులు, నేలబావులు ఉన్న చోట వేసవిలో సాగు చేశారు. అలాగే ఖరీఫ్‌లో కూడా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కడా తెగులు ఆశించకపోవడంతో దిగుబడులు బాగున్నాయి. రామభద్రపురం మండలంలో తారాపురం, ఆరిక తోట, రామభద్రపురం, నాయుడువలస, బూశాయవలస, కొత్తరేగ, పాతరేగ, కొట్టక్కి, రొంపల్లి, దుప్పలపూడి, మామిడివలస, ముచ్చర్లవలస,బాడంగి మండలంలోని కామన్నవలస, కోడూరు, గజరాయుని వలస, ముగడ, గొల్లాది, రామచంద్రపురం, బొబ్బిలి మండలంలోని గొర్లెసీతారాంపురం, మెట్టవలస, గొల్లపల్లి, పాతబొబ్బిలి తదితర గ్రామాల్లో సుమారు 300ఎకరాల్లో బెండ పంట వేశారు. రామభద్రపురం మార్కెట్‌లో సుమారు 15 కిలోలున్న బెండ కాయలు క్రేట్ రూ.300 నుంచి రూ.350 వరకు ధర పలుకుతోంది.గిరాకీ ఉండడంతో రైతులు మార్కెట్‌కు తెచ్చిన వెంటనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో వేసిన బెండ పంటకు రూ.20 వేలు పెట్టుబడి పెడితే రూ.35 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాగే దీనిలో అంతర పంటగా కాటా బంతి(పొట్టి)చిక్కుడు వేస్తామని, ఈ పంట పూర్తయిన వెంటనే చిక్కుడు పంట చేతికందుతుందని అంటున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడడంతో సాగునీటి ఇబ్బంది ఉండదని తెలిపారు. రామభద్రపురం మార్కెట్ అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ కావడంతో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, రావులపాలెం, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలైన ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు అధికశాతం మంది వచ్చి కొనుగోలు చేయడంతో బెండకాయల అమ్మకాలు బాగున్నాయని రైతులు అంటున్నారు.

ఆదాయం బాగుంది



బెండ సాగుతో ఆదాయం బాగుంది. నేను వేసవిలో నెల రోజులు కొద్దిగా కష్టపడి సాగునీరందించాను.పెట్టిన పెట్టుబడి పోను మంచి లాభం వచ్చింది. ఇంకా పంట సాగులో ఉంది. పూర్తయ్యేసరికి మంచి ఆదాయమే వస్తుంది. సీహెచ్ పైడిపునాయుడు, రైతు, రామభద్రపురం

ఈ ధర ఉంటే మంచి ఆదాయమే వస్తుంది



ప్రస్తుతం బెండకాయల క్రేట్ ధర రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. పంట పూర్తయినంత వరకు ఈ ధర ఉంటే మంచిదే. పెట్టుబడికి ఢోకా ఉండదు. దీనిలో అంతర పంటగా పొట్టిచిక్కుడు వేస్తున్నాం కాబట్టి అధిక ఆదాయమే వస్తుంది. పి.సత్యం, రైతు, ఎస్.చింతలవలస

బెండ సాగుకు అన్ని సీజన్లు అనుకూలమే



బెండ సాగుకు ఖరీఫ్, రబీ సీజన్‌లు అనుకూలమే. సాగునీటి వనరు ఉన్న చోట ఏ కాలంలోనైనా ఏడాది పొడవునా పండుతుంది. ఈ పంటకు ఎండ బాగా తగలాలి. నీరు నిల్వ ఉండకూడదు. మొలకెత్తిన నెల రోజులకు పూత వస్తుంది. పూత వచ్చిన వారానికి కాయలు తయారవుతాయి. అప్పటి నుంచి దాదాపు కొన్ని నెలల పాటు కాపు ఉంటుంది. చీడపీడల బెడద అంతగా ఉండదు. నాణ్యమైన నాటు విత్తనాలు దొరికితే సరే. లేకపోతే హైబ్రిడ్ విత్తనాలైన జనార్దన్, హరిత, అర్క అభయ్, అర్క అనామిక లాంటి వాటి కోసం ప్రయత్నించి నాటుకుంటే తెగుళ్లను తట్టుకోవడంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. ఈ పంటను ఇంటి ఆవరణలోను పండించుకోవచ్చు. మోహనకృష్ణ, ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం

మంచి పోషకాహారం బెండ



బెండలో పోషకాలు అధికంగా ఉంటాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ తినవచ్చు. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలతో ఉండే బెండ క్రమం తప్పకుండా తినాల్సిన కూరగాయ. దీనిలో పీచుపదార్థం ఉంటుంది. విటమిన్ సి, బి కాంప్లెక్స్ ఉంటాయి. అలాగే పొటాషియం కంటెంట్ ఎక్కువగానే ఉంటుంది. బెండకాయ వేపుడు తినే కంటే పులుసు చేసుకుని తింటే మూలకాలు ఎక్కువగా ఉంటాయి. దీనికి కేన్సర్ నియంత్రణ శక్తి దీనికి ఉంది. దిలీప్‌కుమార్, మండల వైద్యాధికారి,రామభద్రపురం

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి

- ఈనెల 9,10 తేదీల్లో జిల్లా వేదికగా జరగనున్న పోటీలు

విజయనగరం: జిల్లా కేంద్రం వేదికగా రాష్ట్రస్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లా బాల, బాలికల జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగర శివారులో గల విజ్జి స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించగా..మొత్తం 60 మంది క్రీడాకారులు హజరయ్యారు. వారికి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డీవీ చారిప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించగా..పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9,10 తేదీల్లో విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్స్ బాల, బాలికల తైక్వాండో పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీలను ప్రారంభించిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు విజయనగరంలో నిర్వహించడం శుభపరిణామమన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు చక్కటి వేదికగా నిలుస్తాయని, ఇటువంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు బహుమతులు ప్రదానం చేశారు.

తైక్వాండోలో జిల్లాకు 32 పతకాలు

- రాష్ట్రస్థాయిలో మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 3,4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్, కాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. మొత్తంగా 32 పతకాలు సాధించి విద్యలనగరం విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. పోటీల్లో సబ్ జూనియర్ పూమూసే విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్, క్యురోగి సబ్ జూనియర్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్, కేడెట్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 14 గోల్డ్, 7 సిల్వర్, 11 బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. క్రీడాకారులు పతకాల సాధనలో కీలకమైన కోచ్‌లు ఎం. గగన్ సాగర్ దొర, కె.చైతన్య, సీహెచ్ యశస్వినిలను, గెలుపొందిన క్రీడాకారులను ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



సతీష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్‌లో బుధవారం విద్యుత్ షాక్ తగిలి ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏఓ హోమ్స్‌లో తన ఇంటికి స్టీల్ గ్రిల్స్ బిగించేందుకు యజమాని కొండలరావు పట్టణానికి చెందిన వెల్డర్ దార్ల సతీష్(28)తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. బుధవారం పనికి వచ్చిన సతీష్ స్టీల్ రాడ్లు మేడమీదికి తీసుకెళ్లే క్రమంలో ఎదురుగా ఉన్న విద్యుత్‌వైర్లుకు రాడ్స్ తగలడంతో షాక్‌కు గురై కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఇంటి యజమాని కొండలరావు పక్కనే ఉండడంతో అతని తలకు గాయం కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెర్లాం: మండలంలోని ఆమిటి–సతివాడ గ్రామాల మధ్యన ఉన్న ఊటబంద కానా వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఆర్.రమేష్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంతరాం -బలిజిపేట ఆర్అండ్‌బీ రోడ్డులో ఆమిటి దాటిన తరువాత ఊటబంద వద్ద గుర్తు తెలియని మృతదేహంమంగళవారం రాత్రి రోడ్డుపైన వెళ్తున్న వారికి కనిపించింది. ఆ మృతదేహాన్ని చూసిన వారు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని వయస్సు సుమారు 70–75ఏళ్ల ఉంటుంది. నల్ల రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. గడ్డం ఎక్కువగా పెరిగి ఉంది. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై రమేష్ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. గుర్తు తెలియని మృతదేహం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎరువుల శాంపిల్స్ తీయడంలో అలసత్వం

- ఖరీఫ్‌లో శాంపిల్స్ లక్ష్యం 190
- ఇప్పటివరకు తీసింది కేవలం 13



పొలంలో ఎరువు వేస్తున్న రైతు



డీఏపీ ఎరువుల బస్తాలు

విజయనగరం ఫోర్ట్: ఏపంట అయినా దిగుబడి బాగుండలంటే అది ఆ పంటకు వేసిన ఎరువులపై ఆధారపడి ఉంటుంది. ఎరువు నాణ్యమైనదైతే పంట దిగుబడి బాగుంటుంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమై వివిధ పంటల సాగు ఇప్పటికే ప్రారంభమైంది. చాలా మంది రైతులు పంటలకు ఎరువులను పొలాల్లో వేసేశారు. దీంతో పొలాల్లో వేసిన ఎరువు నాణ్యనమైనదో కాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

లక్ష్యం 190

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏటా ఎరువుల శాంపిల్స్ తీసి వాటి నాణ్యత కోసం ల్యాబ్‌కు పంపిస్తారు. ఎరువు నాణ్యత లేదని తెలిస్తే సంబంధిత కంపెనీ, ఎరువులు విక్రయించిన డీలర్‌పై కోర్టులో కేసు పెడతారు. ఈ ఖరీఫ్‌లో ఎరువుల శాంపిల్స్ లక్ష్యం 190 కాగా ఇంతవరకు కేవలం 13 శాంపిల్స్ మాత్రమే వ్యవసాయ అధికారులు తీశారు. 177 శాంపిల్స్ ఇంకా తీయాల్సి ఉంది. రైతులు పొలాల్లో ఎరువులు చాలావరకు వినియోగించినప్పటికీ శాంపిల్స్ సేకరణ పూర్తిస్థాయిలో కాలేదు.

49,167 హెక్టార్లలో పంటల సాగు:

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 49,167 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధానంగా వరి పంట 34,910 హెక్టార్లు, మొక్కజొన్న 7291 హెక్టార్లు, నువ్వు పంట 3325 హెక్టార్లు, పత్తి 1078 హెక్టార్లు గోగు 80 హెక్టార్లు,, చెరుకు 2297 హెక్టార్లు,ఇతర పంటలు 186 హెక్టార్లలో పంటల సాగవుతున్నాయి.

51,477 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం:

ఖరీఫ్ సీజన్‌లో 51,477 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం అవుతుంది.
అయితే 24, 521 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించారు.

త్వరగా శాంపిల్స్ చేస్తాం

ఎరువుల శాంపిల్స్ ఖరీఫ్ సీజన్‌లో 190 తీయాలి. ఇప్పటి వరకు 13 శాంపిల్స్ తీశారు. మిగతావి కూడా త్వరితగతిన తీసేవిధంగా చర్యలు తీసుకుంటాం.
వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఈనెల 9న ‘మేము సైతం’

- రక్తదాన శిబిరంలో కనీసం 50 యూనిట్ల సేకరణ లక్ష్యం
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రక్తదాన సేకరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న ‘మేము సైతం’ శీర్షికన కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి మండలంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని, ప్రతి శిబిరంలో కనీసం 50 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యం విధించనున్నట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రం అందజేస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక మాట్లాడుతూ ఐదు నెలల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఎస్.సేతు మాధవన్ పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలి

జిల్లా, మండల, గ్రామస్థాయిలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు సంబంధించి ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వసతి గృహాలను ఏర్పాటుచేయాలని సూచించారు. డ్రాపౌట్స్‌ను గుర్తించి దూర విద్య ద్వారా పది, ఇంటర్మీడియట్ కోర్సుల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ‘పేదల సేవలో’ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలో రూపొందించనుందని, దీనికి సంబంధించి విధి విధానాలు రావాల్సి ఉందన్నారు. ప్రతి అధికారి నెలలో ఒక రోజు గ్రామంలోకి వెళ్లి ప్రజలకు కావాల్సిన సేవలు, సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ ఎస్.సేతు మాధవన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.

21వ అఖిల భారత పశుగణనకు ఏర్పాట్లు

- సెప్టెంబర్ 1 నుంచి 21 వరకు కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక అధికారి డా.శివ్వాల మన్మథరావు

పార్వతీపురంటౌన్: 21వ అఖిల భారత పశుగణనకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.శివ్వాల మన్మథరావు తెలిపారు. పశుగణనకు సంబంధించి మంగళవారం ఆయన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు 5 సంవత్సరాలకు ఒకసారి పశుగణన నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల మొత్తం 2,89,677 కుటుంబాలను పశుసంవర్ధక శాఖ నుంచి ఎంపిక చేసిన 294 మంది ఎన్యుమరేటర్లు 25 మంది సూపర్‌వైజర్లు ప్రతి ఇంటిని సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. నమోదు ప్రక్రియ అంతా మొబైల్ యాప్ ద్వారా జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించడానికి 25 మంది పశువైద్యులను సూపర్‌వైజర్లుగా నియమించామని తెలిపారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 2019లో 20వ పశుగణన జరిగినదని, మళ్లీ ఐదేళ్ల తర్వాత సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 21 తేదీ వరకు పశుగణన చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని వివరించారు. కావున పశువైద్యాధికారులు సిబ్బంది అందరూ వారి పరిధిలోనే ఇళ్లను సందర్శించి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు పందులు, పెరటి కోళ్లు పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు వంటి దాదాపు 15 అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్, బట్ప్రలి, డా.ఆర్. నీలయ్య, సహాయ సంచాలకుడు డా. కె. ప్రసాద్, పశు వైద్యాధికారులు డా.రమేష్, డా.చక్రధర్ పాల్గొని, సూపర్‌వైజర్ల్, ఎన్యూమరేటర్లకు పశుగణనపై ప్రత్యేక శిక్షణ నిర్వహించి, పశుగణనలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.